# ఎండని ఏడో చేప

అనగా అనగా ఒక ఊళ్ళో ఒక రాజు గారు.

ఆయన పేరు సన్యాసి రాజు.

ఆయనకు ఏడుగురు కొడుకులు.

ఒక రోజు ఏడుగురు కొడుకులూ కలసి బజారుకి వెళ్ళారు.

దూరం నుంచి చూసేసరికే బజారు పైన మంటలు కనబడుతున్నాయి.

అది చూసి ఆరుగురు కొడుకులు వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు.

ఏడో కొడుకు మాత్రం సంగతి కనుక్కుందామని ముందుకే వెళ్ళాడు.

''బజారూ -- బజారూ! ఎందుకు మండుతున్నావు?'' అని అడిగాడు.

''కళ్ళజోడు మార్పించుకో -- మండుతున్నది నేను కాదు - ధరలు!'' అన్నది బజారు విసుక్కుంటూ.

మార్పించాలంటే కళ్ళజోడు ధరలు కూడా పెరిగినాయి కనక, మార్పించకుండానే అడిగాడు.

''ధరలూ -- ధరలూ! ఎందుకు మండుతున్నారు?''

''ఉత్పత్తి తగ్గి'' అన్నాయి ధరలు.

''ఉత్పత్తీ -- ఉత్పత్తీ ఎందుకు తగ్గావు?''

''నిద్రపోకు -- మత్తు వదిలించుకుని మాట్లాడు. నేనేం తగ్గలేదు. ఇంకా పెరిగాను కూడా. కానీ, ప్రజలు ఇంకా ఎక్కువగా పెరగడం వల్ల అలా అనిపిస్తున్నదంతే!'' అన్నది ఉత్పత్తి.

అతను చన్నీళ్ళతో ముఖం కడుక్కుని, నిద్రమత్తు వదిలించుకున్నాడు.

''ప్రజలూ -- ప్రజలూ! ఇంత ఎక్కువగా ఎందుకు పెరిగారు?'' అడిగాడు.

ప్రజలు పకపకా నవ్వారు.

''ముందు మీ నాన్నని అడుగు ఏడుగురు పిల్లల్ని ఎందుకు కన్నాడో!'' అన్నారు ప్రజలు.

అతను వాళ్ళ నాన్నను అడుగుదామనుకున్నాడు కానీ, చచ్చిపోయిన వాళ్ళ నాన్న ఏ లోకానికి పోయాడో అతనికి తెలియదు.

అందుకే విసుక్కున్నాడు.

"కథ అడ్డం తిరిగింది!" అనుకున్నాడు.

★ ★ ★

"చూశావా -- ఇలా జరుగుతుందని మాకు ముందే తెలుసు!" అన్నారు అతని ఆరుగురు అన్నలూ.

"మరి కథ ఒక పేజీ కూడా రావడం లేదు. ఎలా?" అడిగాడు ఏడో కొడుకు.

"రాత్రి బాగా చీకటి పడిన తరవాత వెళ్ళు -- అక్కడ మంచి కథ నడుస్తుంది!" సలహా ఇచ్చారు అతని అన్నలు ఆరుగురూ.

★ ★ ★

ఏడో కొడుకు బజారుకు వెళ్ళేసరికి బాగా చీకటిగా ఉంది.

"నల్ల బజారూ -- నల్ల బజారూ -- ఏమిటి ఇలా ఉన్నావు?" అడిగాడు.

"భూమిలో పాతేస్తే ఇంతే మరి -- బయటకు వస్తే ధరలు తగ్గుతాయని వ్యాపారులు అందుకు అంగీకరించరు. అందుకనే ఇలా ఉన్నాను!"

పాల డబ్బాలు దొరకని పసిపాపలూ, తిండిగింజలు దొరకని సామాన్యులూ అతని మదిలో మెదిలారు.

"వ్యాపారులూ -- వ్యాపారులూ -- మీ కిదేం బుద్ధి!"

"ఏం చేయం -- మేం సంపాదించేది పన్నులు కట్టడానికీ, కమిషన్లు ఇవ్వడానికే చాలటం లేదు. అందుకే ఇలా ధరలు పెరిగేదాకా దాస్తున్నాం. అన్ని వస్తువులనూ కల్తీ చేస్తున్నాం!"

వాళ్ళు చెప్పిన మాటలలో కూడా కల్తీ కనపడిందతనికి.

"కల్తీ -- కల్తీ -- నీ వల్ల సమాజానికి ఎంత భయంకర ప్రమాదమో తెలుసా -- నిత్యావసారాలన్నీ మందులతో సహా కల్తీ అయితే పసిపాపలూ, భావి భారత పౌరులూ ఏమవాలి? నిన్ను పట్టిస్తాను. జైల్లో పెట్టిస్తాను!"

కల్తీ కల్తీగా నవ్వింది.

"జైల్లో పెట్టిస్తావా? ఎవరు నన్ను జైల్లో పెట్టేది? జైల్లో పెట్టేట్టయితే ఏనాడో పెట్టేవారు. నన్ను పెడతామన్న వాళ్ళకు లంచం ఇస్తే నోరు మూసుకుని మళ్ళీ నా ఛాయలకు రారు!"

అతనికి చిన్నప్పుడు మారం చేస్తే వాళ్ళమ్మ పెట్టిన 'తాయిలం' గుర్తుకు వచ్చింది.

"ఏమయ్యా, కల్తీని జైల్లో పెట్టేవాళ్ళూ! కంచే చేను మేస్తే ఎలా? మీకు లంచాలు ఎందుకు -- జీతాలు తీసుకుంటున్నారు కదా!"

"జీతాలా? అవి జీతాలా? మాకు వాళ్ళిచ్చే జీతాలు పులుసులో ముక్కలకు చాలడం లేదు. మరేం చేయం?"

వాళ్ళు రోజూ ఎంత పులుసు పెట్టుకుంటారో అర్థం కాలేదతనికి.

"ఏమయ్యా -- జీతాలిచ్చే వాళ్ళూ! అలా తక్కువ జీతాలెందుకు ఇస్తున్నారు?"

"ఇంకా ఎక్కువ ఇవ్వాలంటే డబ్బు ఏది? దానికోసం మళ్ళీ కొత్తగా పన్నులు వేయాలి. వేస్తే మళ్ళీ ధరలు పెరుగుతాయి. ధరలు పెరిగితే, మళ్ళీ జీతాలు పెంచాలి -- అదో పెద్ద విషవలయం. నువ్వే చెప్పు ఏం చేయాలో?"

అతనికి దేశభక్తి ఎక్కువ.

అందుకే అతనికి ఏం చేయాలో అర్థం కాలేదు.

బుర్ర గోక్కున్నాడు.

జుట్టు పీక్కున్నాడు.

నువ్వుదామనుకున్నాడు.

ఏడుద్దామనుకున్నాడు.

పరుగెత్తి దూరాన ఉన్న స్తంభాన్ని తాకుదా మనుకున్నాడు.

పల్టీలు కొడదా మనుకున్నాడు.

ఇలా పిచ్చి పిచ్చి ఆలోచనలు వచ్చి, తను ఈ సుడిగుండాన్ని ఆపటానికి ఏమీ చేయలేనని అనుకొని బాధగా, మన దేశం ఏమయిపోవాలి అని తనని తనే ప్రశ్నించుకున్నాడు.

ఇలా అయితే ఎలా అని మనసులో అనుకున్నాడు.

దీనికి కారణం ఏమిటి? ఎవరు? అని పెద్దగా అరిచాడు.

పక్కన ఎవరితో నవ్వినట్టు అనిపించింది.

ఎవరా అని వెదికాడు.

చిన్న చలిచీమ అతణ్ణి చూసి పకపకా నవ్వుతున్నది.

"చీమా, చీమా ఎందుకు నవ్వుతున్నావు!" కోపంగా అడిగాడు.

"అంత చిన్న ప్రశ్నకు నీకు జవాబు తెలియదా అని నవ్వుతున్నాను -- అంతే" అన్నది చీమ ఇంకా నవ్వుతూ.

"నా మనసులో నిజంగా ఎంతో బాధగా ఉంది. అలా నవ్వకు. ఎంతో మంది ప్రాణత్యాగం చేసి సంపాదించిన మన స్వతంత్ర భారతదేశంలో ఇంతగా అరాచకం పెరగడం చూస్తే నా గుండె తరుక్కుపోతున్నది. వాళ్ళు ఆనాడు అంత కష్టపడింది ఎవరి కోసం? దేని కోసం? అలా అనవసరంగా నవ్వకు. నవ్వి నా ఎదలో ముళ్ళు గుచ్చకు. నీకు కారణం తెలిస్తే చెప్పు!"

చీమ చటుక్కున నవ్వడం ఆపి అన్నది: "దీనికి కారణం ఏమీ లేదు -- స్వార్థం -- ఆశ -- స్వార్థం, ఆశ అన్నవి మానవత్వాన్ని చంపడానికి వాడే మారణాయుధాలు. మమత, అనురాగాలను, నీతీ, నిజాయితీలను నాశనం చేసే విష కీటకాలు. ప్రగతినీ, అభ్యుదయాన్నీ దహింపజేసే దావాగ్ని జ్వాలలు. అని మనిషిలో ఉన్నంతకాలం మనుగడ కష్టం. ఎన్ని యుగాలయినా ఇలా జరగవలసిందే!"

ఇంకొక చీమ దగ్గరకు రావడం చూసి, తన నోటి దగ్గర ఉన్న బియ్యపు గింజను ఆ చీమ అడుగుతుందేమోననే భయంతో చలిచీమ చటుక్కున పుట్టలోదూరింది. ❋